క్లుప్తంగా

సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయ గర్భగుడిలో పూజలు చేస్తున్న అర్చకులు

వంగర: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం సంగాంలో వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలోని శివలింగానికి రుద్రాభిషేకం, దీపాలంకరణ చేపట్టారు. ప్రధానార్చకులు సిద్ధాంతం గణపతి ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేసి, దైవదర్శనం చేసుకున్నారు.

దాడితల్లికి క్షీరాభిషేకం



అమ్మవారికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి ఆలయంలో అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. పురోహితులు పిండిప్రోలు మణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్త పూజలు చేసిన తర్వాత 108 లీటర్ల పాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి, ప్రత్యేక పూజలు చేశారు.

పరామర్శ



రామారావునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి తుషార్‌రావు

వంగర: మాజీ సర్పంచ్ బొత్స రామారావునాయుడు కుటుంబ సభ్యులను ఢిల్లీ హైకోర్టు జడ్జి గేదెల తుషార్‌రావు ఆదివారం కలిసి పరామర్శించారు. ఇటీవల రామారావునాయుడు మృతి చెందగా, మండల కేంద్రంలోని ఆయన స్వగృహానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది యలకల రాజగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వస్త్రదానం



పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన దుస్తుల వద్ద పూర్వ విద్యార్థులు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న నిరుపేదలకు స్థానిక శ్వేతా చలపతి పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం వస్త్రదానం చేశారు. వారు తమ 2017–18 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల్లో మృతి చెందిన యశ్వంత్, అమృతల జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్‌జే విల్సన్ బాబా, సుంకరి సత్తిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండగ

బొబ్బిలిరూరల్: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి పల్లె పండగ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల గ్రామాల్లో చేపట్టిన గ్రామసభల్లో ప్రతిపాదించిన పనులను తొలుత చేయనున్నారన్నారు.

సమాజ సేవకు ముందుకురావాలి

రేగిడి: మానవ సేవే మాధవ సేవ అని, ప్రతిఒక్కరూ సమాజ సేవకు ముందుకురావాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో ఉన్న శ్రీరామధర్మ క్షేత్రంలో వారణాసి జగన్నాథస్వామి ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సభ ఆదివారం నిర్వహించారు. చిరువ్యాపారి అయిన జగన్నాథస్వామి ఓ వైపు వ్యాపారం చేసుకుంటూనే మరోవైపు నిత్యాన్నదానం ద్వారా పేదలను ఆదుకుంటున్నారని ప్రశంసించారు. అందరూ తమకు తోచిన దానిలో ఎంతో కొంత నిరుపేదలకు సాయం చేయాలని కోరారు.

సస్యరక్షణ చేపట్టాలి

రేగిడి: వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో మురళీకృష్ణ రైతులకు సూచించారు. ఇదే విషయమై ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఎప్పటికప్పుడు పంట పరిస్థితిని పరిశీలించాలని, తెగులు, చీడపీడల బారిన పంట పడినట్లు గుర్తిస్తే నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వరి పంట పొట్టదశలో ఉన్నప్పుడు పూర్తి స్థాయిలో నీటిని అందించాలన్నారు. పలు గ్రామాల్లోని వరి పొలాల్లో గాబు(పిచ్చిమొక్కలు)తీతలు, పురుగుమందు స్ప్రే చేయడం వంటివి చేస్తున్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు

వాడవాడలా విజయదశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఏటా ఈ పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో శనివారం విజయదశమి పురస్కరించుకుని, భక్తులు ఆలయాలకు చేరుకుని, దుర్గమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పరిశ్రమల్లో ఆయుధ పూజ, ఆలయాల వద్ద వాహన పూజలు చేశారు. సాయంత్రం విగ్రహ తిరువీధి, రావణ దహన కార్యక్రమం, రాత్రి నిమజ్జనోత్సవం ఉత్సాహంగా చేపట్టారు.

– బొబ్బిలి, రాజాం



తెర్లాం: నందిగాంలో ఓం, త్రిశూలం ఆకారాల్లో దీపాలంకరణ



తెర్లాం: నందిగాంలో దుర్గాదేవి మండపం వద్ద హోమం చేస్తున్న భక్తులు



తెర్లాం: పూజలందుకున్న నందబలగ కనకదుర్గమ్మ



బాడంగిలో ట్రాక్టరుపై దుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



రామభద్రపురం: బూసాయవలసలో దుర్గామాతకు భక్తుల పూజలు



రామభద్రపురంలోని సాయినగర్ కాలనీలో పూజలందుకుంటున్న దుర్గమ్మ



రాజాం నవదుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



రాజాం: గాయత్రీదేవి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన 108 రకాల నైవేద్యం



బాడంగిలో దుర్గాదేవి, వినాయక విగ్రహాల ఊరేగింపు



వంగర: రుషింగిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో వాహన పూజలు



రామభద్రపురం కూరాకుల వీధిలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భవానీ భక్తులు



వంగర: మగ్గూరులో భక్తుల పూజలు



రేగిడి: సంకిలిలో దుర్గాదేవి విగ్రహ తిరువీధిలో భక్తుల సందడి

తాటిపూడి జలాశయానికి బుచ్చిఅప్పారావు పేరును పునరుద్ధరించాలి



బుచ్చిఅప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొప్పలవెలమ సంఘ నాయకులు

బొబ్బిలి: తాటిపూడి జలాశయానికి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరును పునరుద్ధరించాలని వక్తలు కోరారు. స్థానిక పట్టణంలోని కొప్పలవెలమ సామాజిక భవనంలో బుచ్చిఅప్పారావు 111వ జయంతి ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కొప్పలవెలమ సంఘ నాయకులు, తదితరులంతా బుచ్చిఅప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాటిపూడి జలాశయానికి బుచ్చిఅప్పారావు పేరు పెట్టి, సముచిత గౌరవం కల్పించిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బుచ్చిఅప్పారావు పేరు తొలగించి, ఆ మహోన్నత వ్యక్తిని అగౌరవపరచడమే కాకుండా ఆయన సామాజిక వర్గాన్ని అవమానపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం తమ తప్పును తెలుసుకుని, జలాశయానికి తిరిగి బుచ్చిఅప్పారావు పేరు పెట్టాలని కోరారు. ఇదే అంశంపై సంఘ సభ్యులంతా తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘ చైర్మన్ గొట్టాపు కృష్ణమూర్తినాయుడు, వైస్ చైర్మన్ కొల్లి రామారావు, అసోసియేట్ అధ్యక్షుడు బలగ సాయికృష్ణ, గౌరవాధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వంగపండు శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

రామభద్రపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరం కృషి చేయాలని ఎమ్మార్పీఎస్(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని ఆరికతోటలో హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సదరు మహానేతలు ఇద్దరూ సామాజిక న్యాయానికి విశేషమైన కృషి చేశారని కొనియాడారు. వారి పోరాట ఫలితంగా అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నిండుకున్నాయన్నారు. అటువంటి మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత అని, ఉత్తమ ఆలోచనా విధానంతో ఉన్నతమైన జీవితం గడపాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని యువత అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

• తుప్పలు తొలగించరూ?



తెర్లాం జంక్షన్ నుంచి బొబ్బిలి వెళ్లే రోడ్డులో రోడ్డుకు ఇరువైపుగా పెరిగిన తుప్పలు, డొంకలు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా తుప్పలు, డొంకలు(జంగిల్) దట్టంగా పెరిగిపోయాయని, వాటిని తొలగించాలని వాహన చోదకులు, ప్రయాణీలు కోరుతున్నారు. మండల కేంద్రమైన తెర్లాం నుంచి రాజాం, బొబ్బిలి వైపు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుతో పాటు, పణుకువలస జంక్షన్ నుంచి బలిజిపేట వైపు, పెరుమాళి జంక్షన్ నుంచి సుందరాడ వైపు వెళ్లే రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచూ చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆయా రోడ్లలోని జంగిల్స్‌ను తొలగించాలని అటువైపుగా వెళ్తున్న వారంతా కోరుతున్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి



సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి, ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దారు ఎం.శ్రీను సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో ఆదివారం సమావేశమైన ఆయన.. మండలంలో 13 సాగునీటి చెరువులతో పాటు మరో ఐదు మామూలు చెరువులు ఉన్నాయని, ఆయా చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతులంతా ఓటర్లుగా నమోదు కావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికల నోటిఫికేషన్ నాటికి ఓటర్ల జాబితా ముసాయిదా తయారు కావాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల డీటీ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



విద్యార్థులకు కంప్యూటర్ జ్ఞానంపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్

బాడంగి: శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి హాజరవుతున్న వారికి పుస్తకాలు, నీతి కథలు చదివించడంతో పాటు కంప్యూటర్ బేసిక్స్ కూడా నేర్పిస్తున్నామని లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



దుర్గాదేవి మండపం వద్ద నృత్య కళాకారిణులు

బొబ్బిలి: పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న దుర్గాదేవి మండపం వద్ద అమ్మవారిని ఆరాధిస్తూ పవిత్ర నృత్యాలయం విద్యార్థినులు ఆదివారం చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ముఖ్యంగా దుర్గమ్మను స్తుతిస్తూ వారు చేసిన నృత్య భంగిమలు వీక్షకులకు నయనానందాన్ని తెచ్చిపెట్టాయి. అనంతరం నృత్య కళాకారులకు మెమొంటోలు, ధ్రువపత్రాలు అందజేసి, సత్కరించారు.

పండగ సందడి

- ఘనంగా రాజాం, సారధి గ్రామదేవతల పండగ
- నెలరోజులుగా ఘటాల తిరువీధి, పూజలు
- విద్యుదీపాలంకరణలతో వెలుగులీనుతున్న వీధులు
- పండగ ఆఖరి అంకానికి చేరుకోవడంతో సందడి వాతావరణం



పోలీస్ బందోబస్తు నడుమ అమ్మవారి ఘట ఊరేగింపు



రాజాంలోని ఓ వీధిలో విద్యుత్ దీపాలంకరణ

రాజాం సిటీ: గ్రామదేవతల పండగలతో రాజాం పట్టణం సరికొత్త కళను సంతరించుకుంది. ప్రతీ రెండేళ్లకోసారి రాజాం, సారధి గ్రామదేవతల ఉత్సవాలు చేస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. సరిగ్గా నెలరోజుల క్రితం ప్రారంభమైన ఈ పండగలో భాగంగా ఆదివారం దుర్గమ్మ, మంగళవారం బురదలపోలమ్మ, గురువారం బంగారమ్మ ఘటాల ఊరేగింపును తొమ్మిది వారాల నుంచి చేపడుతున్నారు. ప్రస్తుతం పండగ ఆఖరి అంకానికి చేరుకోవడంతో పట్టణంలోని వీధులన్నీ విద్యుదీపాలంకరణలతో వెలుగులీనుతున్నాయి. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం ఈ పండగకు రావడంతో చుట్టాలు, బంధువులతో ప్రతీ ఇంట్లో పండగ సందడి నెలకొంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసులు చర్యలు చేపట్టారు.

పండగ చరిత్ర ఇదీ..

రాజాం గ్రామదేవత పండగకు సంబంధించి, పూర్వీకులు తెలిపిన వివరాల ప్రకారం 1900 సంవత్సరం పూర్వం నుంచి దాసరి కుటుంబీకులు వలసల్లో భాగంగా గ్రామగ్రామాన తిరుగాడుతూ చివరిగా రాజాం చేరుకుని పాపాలమ్మ తోటలో విడిది చేసేవారు. ఒకరోజు రాజాం గ్రామదేవత ఆ యజమాని కలలో కనిపించి, నీవు రాజాంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని దేవాంగ కులపెద్దగా, పెద్ద సేనాపతిగా ఉండాలని అమ్మవారు చెప్పారు. 1910లో రాజాం గ్రామంలో కలరా వ్యాధి విజృంభించింది. ప్రజలంతా ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బిక్కుబిక్కుమని కాలం గడిపారు. ఇదంతా అమ్మవారి ప్రభావమని, అమ్మవారిని శాంతింపజేస్తే ఊరంతా ప్రశాంతంగా ఉంటుందని భావించారు. వెంటనే అమ్మవారి ఉత్సవాలు జరిపించేందుకు పెద్దసేనాపతి ఆదేశాలతో చాటింపు వేయించారు. ఒక ఎనుబోతును తీసుకువచ్చి, దాని చెవి కోసి ఊరంతా తిప్పి ఊరవతల విడిచిపెట్టారు. ప్రతిరోజూ రాత్రి భక్తిగీతాలు ఆలపించి, కోలాటాలు, భజనలతో తిరిగేవారు. ఇలా కొన్నాళ్లకు ఊరిలో కలరా పోయింది. పెద్ద సేనాపతి ఆధ్వర్యంలో ప్రతీ రెండేళ్లకొకసారి ఈ పండగ జరిపించేవారు. ఆ తర్వాత మళ్లీ కొన్నాళ్ల పాటు పండగ చేయకపోవడంతో 1943 అక్టోబర్ 31వ తేదీన రాజాం గ్రామంలో ప్రకృతి విలయతాండవం చేసింది. బీభత్సమైన గాలివాన ఊరిని అతలాకుతలాం చేసింది. భారీ ఈదురుగాలులకు ఇళ్లన్నీ కూలిపోయాయి. రోజంతా ఉరుములు, మెరుపులు, మబ్బులతో రాజాంలోని 12 వీధులూ పగలు కూడా చీకటి లోకం చూశాయి. కరువు రాజ్యమేలింది. ప్రజలంతా ఇక్కట్లు పడ్డారు. ఆస్పత్రి రోడ్డులోని అమ్మవారి ఉయ్యాల కంబాల స్థలంలో 9 ఘటాలలో 8 ఘటాలు నీటిలో కొట్టుకుని పోగా ఒక ఘటం మాత్రమే మిగిలింది. ఆ మిగిలిన ఒక్క ఘటాన్నే ఈ నాటికీ భక్తిశ్రద్ధలతో పూజిస్తూ కొలుస్తున్నారు. ఆ ఘటానికి మళ్లీ పూజలు చేసిన సమయంలో అమ్మవారి వారాల చాటింపు వేయగా, ప్రజల కష్టాలు గట్టెక్కాయి. అప్పటి నుంచి తిరిగి అమ్మవారి ఉత్సవాలు చేస్తూ వస్తున్నారు.

అంతా అమ్మవారి అనుగ్రహంతో..

అంతా అమ్మవారి అనుగ్రహంతో గ్రామదేవత పండగను చేస్తున్నాం. రాజాంలోని అప్పటి 12 వీధుల్లో అంగరంగ వైభవంగా నెల రోజుల పాటు ఘటాలు ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికీ పండగ సమయంలో ఎక్కడెక్కడి నుంచో జనం వస్తూ అమ్మవారి ఘటం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్నారు.

– ఆశపు సూర్యం, రాజాం